సాక్షి
పల్నాడు
శనివారం, 6, జూలై, 2024



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నందు అమ్మపేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మొక్కలు నాటారు.



ఘనంగా పూర్ణాహుతి

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం పూర్ణాహుతి హోమాన్ని నిర్వహించారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రులను ప్రారంభించారు. అమ్మవారిని సర్వలక్ష్మీ స్వరూపిణి శ్రీ శ్వేత వారాహి మహాదేవిగా అలంకరించారు.

తగ్గనున్న పత్తి సాగు

- ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాగుకు వెనకడుగేస్తున్న రైతన్నలు
- పత్తి సాధారణ సాగు 1,07,186 హెక్టార్లు
- ఈ ఏడాది 70 వేలు కూడా కష్టమంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- చీడపీడలతోపాటు ధరల్లో గతేడాది వచ్చిన వ్యత్యాసమే కారణం
- కంది, పొగాకు పంటల వైపు మొగ్గు



దుర్గి మండలంలో సాగు చేసిన పత్తి పొలం

సాక్షి, నరసరావుపేట: తెల్ల బంగారంగా పిలిచే పత్తి సాగు జిల్లాలో ఏటికేడు తగ్గిపోతోంది. ఈ ఏడాది పత్తి సాధారణ సాగు 1,07,186 హెక్టార్లు కాగా ఇది ఈ ఏడాది 70 వేల హెక్టార్ల వద్దే నిలిచే అవకాశం ఉందని వ్యవసాయశాఖ, రైతులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది సాధారణ సాగు 1.2 లక్షల హెక్టార్లు కాగా సాగు అయ్యింది కేవలం 65 వేల హెక్టార్లే. ఇలా రెండేళ్ల వరుసగా పత్తి సాగు తగ్గడానికి రెండు ప్రధాన కారణాలు చెబుతున్నారు. బీటీ విత్తన రకాలు వచ్చిన కొత్తలో పత్తి పంటకు తెగులు సమస్య చాలా వరకు తగ్గింది. దీంతో రైతుకు పురుగుమందుల ఖర్చు బాగా తగ్గి ఆదాయం అధికంగా వచ్చేది. రెండు మూడేళ్లుగా బీటీ పత్తిలో గులాబీ రంగు పురుగు లాంటి ఇబ్బంది పెరిగింది. గతంలో 90 రోజుల్లో వచ్చే ఈ పురుగు ప్రస్తుతం 45 రోజుల్లోనే వస్తుండటం పత్తి రైతుల పాలిట శాపంగా మారుతోంది. దీంతో రైతులకు పెట్టుబడి భారీగా పెరుగుతోంది. మరోవైపు గిట్టుబాటు ధర అంతంతమాత్రంగానే ఉంటోంది. ప్రస్తుతం పత్తి క్వింటాలు ధర సగటున రూ.5 వేల ఉంటోంది. ఎకరానికి గరిష్టంగా 6–7 క్వింటాళ్ల పత్తి పండుతోంది. దీంతో రైతులకు రూ.30 వేల దాకా పంట అమ్మకం ద్వారా లభిస్తోంటే, ఖర్చు రూ.30–35 వేలకుపైగా అవుతోంది. దీంతో పత్తి రైతులకు ముఖ్యంగా కౌలు రైతులకు ఎకరానికి రూ.10–15 వేల దాకా నష్టం వాటిల్లుతోంది.

ప్రత్యామ్నాయ పంటల వైపు...

పత్తి సాగు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు కంది, పొగాకు పంటల వైపు వెళుతున్నారు. కంది ధర ఇటీవల కాలంలో రూ.10–12 వేలు పలుకుతోంది. వాతావరణ పరిస్థితులను బట్టి ఎకరానికి 12–20 క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తోంది. పత్తితో పోల్చితే పెట్టుబడి తక్కువగా ఉండటం, ఆదాయం ఎక్కువగా ఉండటంతో వీటి సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. గతేడాది కంది సాధారణ సాగు 11 వేల హెక్టార్లు ఉండగా దాన్ని అధిగమించి 21 వేల హెక్టార్లు పంట సాగు నమోదైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కంది సాగు అధికంగా ఉండనుంది. మరోవైపు పొగాకు సాగు రైతులు బాగా గిట్టుబాటవుతోంది. ఐటీసీ సంస్థ రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకుని రైతులు ఇళ్ల వద్దే పత్తి పంటను కొనుగోలు చేస్తోంది. ఎకరానికి 12–15 క్వింటాళ్ల పొగాకు పంట చేతికి రాగా ధర రూ.15–16 వేలు ఉంటోంది. దీంతో రైతులకు ఎకరానికి రూ.50–70 వేల దాకా మిగులుతోంది.

ప్రతి ఏడాదీ తగ్గుతున్న పత్తి సాగు



2022 ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో 1.3 లక్షల హెక్టార్లలో పత్తిపంట సాగుకాగా, 2023 ఖరీఫ్ నాటికి ఏకంగా 65 వేల హెక్టార్లకు పడిపోయింది. ఈ ఏడాది ఇది 70–80 వేల హెక్టార్ల మధ్య ఉండే అవకాశం ఉంది. దీనికి ప్రధాన కారణం ధర తగ్గడం, తెగులు సమస్య అధికమవ్వడం. దీంతో పత్తి సాగు కొంత నష్టదాయకంగా మారింది. పత్తి రైతులు కంది, పొగాకు వైపు మళ్లుతున్నారు.

– ఐ మురళి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పల్నాడు జిల్లా.

గిట్టుబాటుకాకపోవడంతోనే ...



ఈ ఖరీఫ్ సీజన్‌లో బోరు కింద ఐదెకరాలు పత్తి పంటను సాగు చేస్తున్నా. గులాబీ రంగు పురుగు బెడద, ఎమ్మెస్పీ ధర గిట్టుబాటుకాకపోవడంతో పత్తి సాగు ఆశాజనకంగా లేదు. క్వింటా పత్తి తీయడానికే రూ.1,500 అవుతుంది. ఎకరానికి సగటున రూ.30 వేలకు పైగా పెట్టుబడి అవుతుంది. కానీ దిగుబడి ఎకరానికి సగటున ఐదు క్వింటాళ్లు మాత్రమే పండుతోంది. లాభం రాకపోగా చేతి నుంచి డబ్బులు పెట్టాల్సి వస్తోంది.

– శ్రీనివాసరావు, రైతు, దుర్గి

కక్ష సాధింపు మానుకోవాలి

- ప్రతిపక్షం ఆస్తుల ధ్వంసం దుర్మార్గం
- అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి
- ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుంది.
- వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి



ఇప్పటంలో ఇరిగేషన్ అధికారులు కూల్చివేసిన పశువుల పాకను పరిశీలిస్తున్న వేమారెడ్డి

తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సానుభూతిపరులపై దాడులకు పాల్పడుతూ వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పటంలో ఇరిగేషన్ అధికారులు పాక్షికంగా తొలగించిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, రైతు హరిబాబు గౌడ్ పశువుల పాకను వేమారెడ్డి వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమర నాగయ్యతో కలసి శుక్రవారం పరిశీలించారు. దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన నేతలు కక్షపూరితంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడడంతో పాటు ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం వంటి వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశాడనే నెపంతోనే ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి హరిబాబు గౌడ్ పొలం పక్కనే ఉన్న పశువుల పాకను తొలగించారని విమర్శించారు. ఈ చర్యను మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఖండించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇప్పటం అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వరరావు, కాపు సంఘం నాయకులు కుంచనపల్లి పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు, కొలనుకొండ పార్టీ అధ్యక్షులు నూతక్కి శ్రీనివాసరావు, వడ్డేశ్వరం పార్టీ అధ్యక్షులు గొడవర్తి శ్రీనివాసరావు, యస్‌కె మీరాషా, ఉమామహేశ్వరరావు గౌడ్, సాంబయ్య, ప్రవీణ్, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, లచ్చి తులసీదాసు, రాజా రామిరెడ్డి, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వ్యవసాయ గణన

అద్దంకి: రెండో దశ వ్యవసాయ గణనను పారదర్శకంగా నిర్వహించాలని బాపట్ల సీపీవో జె.కె.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ గణన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ గణనను ఆంధ్రప్రదేశ్ అర్థ గణాంక శాఖ ద్వారా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి చేపడతారని తెలిపారు. మొదటి విడతకు కొనసాగింపుగా రెండో విడత గణనను ప్రారంభించనట్లు చెప్పారు. 2021–22 రెవెన్యూ రికార్డుల ప్రకారం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సాగు చేసిన పంటల వివరాలు, కమతపు ప్రధాన నీటి వనరు షెడ్యూలు నింపడానికి గ్రామ రెవెన్యూ అధికారులు గణకులుగా, మండల సహాయ గణాంకాధికారి పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తారని చెప్పారు. గణన కోసం వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉద్యోగుల్ని కూడా నియమించుకోవచ్చని చెప్పారు. గణనను ఆధునిక పద్ధతిలో కంప్యూటర్‌లోని యాప్ ద్వారా చేస్తారని వివరించారు. వివిధ రైతు సంబంధిత సంక్షేమ పథకాల అమలుకు, విధాన పరమైన నిర్ణయాలు తీసుకునేందుకు, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ గణన ఉపయోగపడుతుందని చెప్పారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో పార్వతీపురం కలెక్టర్

అమరావతి: అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుణ్ణి శుక్రవారం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల పార్వతీపురం జిల్లా కలెక్టర్‌గా నియమితులైన శ్యాంప్రసాద్ దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ గోపీనాథశర్మ, అర్చకులు కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

31లోగా పీఎం బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: దేశంలో అసాధారణమైన ధైర్యసాహసాలు నిస్వార్థమైన సేవలు అందించిన ధైర్యవంతులైన చిన్న పిల్లలకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డుల కోసం ఈనెల 31లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇతరులకు ఆదర్శంగా ఉండేవారు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, నూతన ఆవిష్కరణలు ప్రత్యేక నైపుణ్యం కలిగిన బాలలకు ఈ అవార్డులు ఇవ్వబడతాయన్నారు. భారత పౌరులై నివాసితులై ఉండాలని, ఐదేళ్ల నుంచి 18ఏళ్లలోపు పిల్లలు, దరఖాస్తు చేసే సమయానికి రెండేళ్లలోపు చేసిన చర్యలు, సామర్థ్యాలు, విజయాలు అర్హతలుగా పరిగణలోకి తీసుకోవటం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారుడు ఎన్ని విభాగాల్లో దరఖాస్తు చేసినా ఒక దరఖాస్తు మాత్రమే ఆమోదిస్తారన్నారు. పై అర్హతలను బట్టి ఆన్‌లైన్‌లో https://awards.gov.in వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు



నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శనివారం శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి) శనివారం తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన వారాహి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్త పూజలతో శుక్రవారం కనకదుర్గమ్మ సన్నిధిలో ఏర్పాటు చేసిన పీఠంపైకి ప్రవేశం కలిగించారు. కృష్ణానది ఒడ్డున కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రప్రథమంగా చేపట్టిన ఆషాఢ వారాహి నవరాత్రుల్లో సంప్రదాయ రీతిలో జరిపేందుకు సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుతశేఖర శర్మ వారాహి సంప్రదాయాలను వివరిస్తూ 6న ఉన్మత్త వారాహి పూజ(ఇంద్రాణిదేవి),7న బృహత్ వారాహి(బ్రహ్మీదేవి), 8న స్వప్న వారాహి పూజ (వైష్ణవీదేవి), 9న కిరాత వారాహి(మహేశ్వరి), 10న శ్వేత వారాహి(వారహి దేవి), 11న ధూమ్ర వారాహి(మహేశ్వరి), 12న మహా వారాహి(చాముండి దేవి),13న వార్తాలి వారాహి(మహాగౌరి, మహాలక్ష్మి) 14న దండిని వారాహి పూజ(లలితాదేవి), 15వ తేదీన ఆది వారాహి మహాపూజ–ఉద్యాపనతో నవరాత్రులు ముగుస్తాయని తెలిపారు.

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన ముత్యాల బాల్‌రెడ్డి దంపతులు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో కె.ఎస్.రామరావును కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలలో తనిఖీలు

రూ.10లక్షల విలువైన విత్తనాలు, పురుగుమందులు సీజ్



పార్సిల్ కార్యాలయంలో అధికారులు సీజ్ చేసిన విత్తనాలు

నరసరావుపేట రూరల్: పట్టణంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించాయి. రూ.10,04,700 విలువైన విత్తనాలు, పురుగుమందులు సీజ్ చేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో రెండు బృందాలను జిల్లాలో ఏర్పాటుచేశారు. ఈ బృందాలు శుక్రవారం పట్టణంలోని విత్తన డీలర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలలో తనిఖీలు నిర్వహించాయి. వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలోని బృందం విత్తన డీలర్ల దుకాణాలను తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని రూ.4.77 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. రెండవ బృందం ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రయ్య బృందం ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలను, డీలరు షాపును తనిఖీ చేసి రూ.1,26,500 విలువైన బయో స్టిములెన్స్‌ను పురుగుమందును, సరైన ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.4.8లక్షల మొక్కజొన్న విత్తనాలను సీజ్ చేశారు. సరైన పత్రాలు లేకుండా నాసిరకం విత్తనాలను రైతులకు విక్రయిస్తే విత్తన డీలర్స్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, లైజనింగ్ ఆఫీసర్స్ ఏవో ప్రవీణ, వరలక్ష్మి, ఏఈవో బ్రహ్మయ్య, రామిరెడ్డి, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు బస్టాండ్ నుంచి త్వరలో బస్ సర్వీసులు

- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ
- బస్సు సర్వీసులు ప్రారంభించాలని అధికారులను కోరిన ఎమ్మెల్యే



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఆర్టీసీ అధికారులు

నరసరావుపేట: పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం పరిశీలించారు. గతంలో ఇక్కడ పల్నాడు బస్టాండ్ ఉండేదన్నారు. ఇప్పుడు రోడ్డుపైనే దశాబ్దాలుగా కనీస సదుపాయాలు లేక పల్నాడువైపుకు వెళ్లే బస్సులు ఎక్కేందుకు వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం అన్నారు. అందుకే వీలైనంత త్వరగా ఈ స్థలంలో పల్నాడు బస్టాండ్‌ను పునరుద్దరించి త్వరగా బస్సు సర్వీసులు ప్రారంభించి ప్రజలకు తోడుగా ఉంటామని అరవిందబాబు అన్నారు. ఆర్టీసీ ఆర్ఎం ఎన్వీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, ఆర్టీసీ ఇంజినీర్, నాయకులు కపలవాయి విజయకుమార్, వాసిరెడ్డి రవి, కొట్టా కిరణ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- యువకుడు మృతి
- యువతి పరిస్థితి విషమం

సత్తెనపల్లి: ప్రేమికుల జంట ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీకి చెందిన బండారు నవీన్ (25) నరసరావుపేటలోని బన్‌ధన్ బ్యాంకులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల చిలకలూరిపేటకు చెందిన మెడబలిమి అనూషతో పరిచయం ఏర్పడి అది కాస్త వారి మధ్య ప్రేమగా మారింది. వివాహమైన మహిళను తాను ప్రేమించానని నవీన్ తన తల్లిదండ్రులకు చెప్పడంతో పెళ్లయిన మహిళతో ప్రేమ ఏమిటని వారు ప్రశ్నించారు. మనస్థాపానికి గురైన నవీన్ అనూషతో కలసి వారి పొలంలో ఈ నెల 3న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఇదే విషయాన్ని నవీన్ తన సోదరుడైన సాగర్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. సాగర్ తన తండ్రికి ఫోన్ చేసి చెప్పడంతో హుటాహుటిన పొలం వద్దకు వెళ్లి చూడగా నవీన్, అనూషలు అక్కడ పడి ఉండటంతో ద్విచక్ర వాహనాలపై ఎక్కించుకొని సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ నవీన్ శుక్రవారం మృతి చెందాడు. అనూష పరిస్థితి కూడా విషమంగా ఉంది. అనూషకు నాలుగేళ్ల క్రితం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం రమణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మెడబలిమి లక్ష్మణరావుతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె కూడా ఉంది. లక్ష్మణరావు మద్యంకు బానిస కావడంతో కుమార్తెను తీసుకొని అనూష పుట్టింటికి వచ్చింది. నవీన్ మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ జే.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెంపుడు జంతువులతో జరభద్రం!

- అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ప్రమాదం
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



పట్టణంలో పెంపుడు కుక్కలతో పవర్ లిఫ్టర్ పసుపులేటి సురేష్

సత్తెనపల్లి: పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే స్వభావం ఉన్న వ్యాధుల్ని జూనోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. సుమారు 200లకు పైగా ఈ జూనోటిక్ వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్ట మొదటిసారి 1885వ సంవత్సరం జులై 6న పిచ్చికుక్క కాటుకి గురైన వ్యక్తి ప్రాణాలను 'యాంటీ రేబీస్ టీకా' ద్వారా కాపాడిన సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీన 'జూనోసిస్ డే' గా జరుపుకుంటున్నారు.

పెంపుడు జంతువుల యజమానులకు సూచనలు

- పెంపుడు జంతువుల్లో ముఖ్యంగా రేబీస్ నివారణ కోసం టీకాలు సకాలంలో వేయించడం ముఖ్యం. పశు వైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి.
- పెంపుడు జంతువులను, వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తర్వాత చేతులను శుభ్రంగా కడగడం, లిట్టర్ బాక్సులు, పంజరాలను తరచూ శుభ్రం చేయాలి.
- బయట తిరిగే జంతువులకు క్రమం తప్పకుండా క్రిములను తొలగించాలి.
- పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూడటంతోపాటు, సరైన రక్షణ లేకుండా గాయపడిన అడవి జంతువులను రక్షించడానికి ప్రయత్నించవద్దు.
- అనారోగ్య లక్షణాలను గమనించాలి. ప్రవర్తన, ఆకలి లేదా రూపంలో మార్పులను గమనించడం, ఏదైనా సాధారణమైనది గమనిస్తే వెంటనే పశు వైద్యున్ని సంప్రదించాలి.

అవగాహన పెంచుకోవాలి..

- జూనోటిక్ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- జంతు ఆరోగ్యం, జూనోసిస్‌పై వర్క్‌షాప్‌లు లేదా సెమినార్లకు హాజరు కావాలి.
- అనుమానిత జూనోటిక్ వ్యాధులను గుర్తిస్తే పశు వైద్యులు, అధికారులకు తెలియజేయాలి.
- జంతు ఉత్పత్తులను పూర్తిగా వండడం, సురక్షితమైన ఆహార నిర్వహణ, సరైన రీతిలో నిల్వను పాటించాలి.
- వ్యాధులను వ్యాప్తి చేసే కీటకాలు, ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.
- సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రోత్సహించే పద్ధతులను పాటించాలి.

వ్యాధులు సంక్రమించకుండా టీకాలు



జూనోటిక్ వ్యాధులతో మానవాళి మనుగడకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా పశువర్ధక శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఏటా జూనోసిస్ దినోత్సవాన్ని జులై 6న జరుపుకోవడం ఆనవాయితీ. వ్యాధుల పట్ల మరిన్ని సలహాలు సంప్రదించటం కోసం ప్రభుత్వం 1962 టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా రేబీస్ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులైన కుక్కలకు టీకాలు వేయించాలి.

–డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, పశు వైద్య సహాయ సంచాలకులు, సత్తెనపల్లి.

కార్పొరేషన్ స్కూళ్లకు కోడిగుడ్ల సరఫరా

'సాక్షి' కథనంతో ప్రభుత్వంలో కదలిక

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచి గుంటూరు కార్పొరేషన్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వకపోవడంపై 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో గురువారం 'ఎగ్గొట్టారు' శీర్షికన ప్రచురించిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారమే వెలగపూడిలోని సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందిన నేపథ్యంలో గుడ్డు ఇవ్వకపోతే ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని భావించి తక్షణమే పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి గుంటూరు కార్పొరేషన్ పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా ప్రారంభమైంది. శుక్రవారం నగరపాలకసంస్థ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని కోడిగుడ్డుతో కలిపి వడ్డించారు. ''సాక్షి'' కథనంతో విద్యార్థులకు మేలు జరిగిందని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



గుంటూరు జలగం రామారావు కార్పొరేషన్ హైస్కూల్లో విద్యార్థులకు వడ్డించిన కోడిగుడ్డు

యార్డులో 29,712 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,582 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,712 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.19,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,289 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడిగా ఎం.ఇన్నారావు

క్రోసూరు: క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడిగా డాక్టర్ ఎం.ఇన్నారావు నియమితులయ్యారు. అచ్చంపేట మండలం మాదిపాడు పీహెచ్‌సీ వైద్యుడిగా పనిచేస్తున్న వైద్యుడు డాక్టర్ ఇన్నారావును క్రోసూరు పీహెచ్‌సీకి పూర్తి స్థాయి వైద్యుడిగా(డీడీవో)గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పీహెచ్‌సీ వైద్యురాలిగా పనిచేసిన డాక్టర్ ఎస్.బాలఅంకమ్మబాయి ఆసుపత్రి ఏఎన్‌ఎంలు, సిబ్బందిని వేధిస్తున్నట్లు, జీతాలు కూడా ఇవ్వకుండా అసభ్య పదాలతో దూషిస్తున్నట్లు చేసిన ఆరోపణల నేపథ్యంలో గత బుధవారం ఉన్నతాధికారులు విచారించారు. విచారణ అనంతరం ఇచ్చిన నివేదిక మేరకు జిల్లా వైద్య అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. డాక్టర్ బాలఅంకమ్మబాయిని పీపీ యూనిట్ సత్తెనపల్లికి బదిలీ చేశారు.

భక్తులకు మరిన్ని సదుపాయాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులందరికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఈవో కెఎస్.రామరావు తెలిపారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండపైకి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుళాయిలను శుక్రవారం ఈవో ప్రారంభించారు. ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకునే భక్తులు కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వీలుగా కుళాయిలను ఏర్పాటు చేశామని చెప్పారు. లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన ఈవో పలు సూచనలు చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2400, గరిష్ట ధర రూ.3500, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

కూటమి పార్టీలు విడివిడిగా పోటీ చేస్తే సింగిల్ డిజిట్ వచ్చేది..

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వైఎస్ జగన్ కలవడం నేరమా
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



వెల్దుర్తి: టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేస్తే సింగిల్ డిజిట్ సీట్లు మాత్రమే వచ్చేవని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన పల్నాడు జిల్లా శ్రీరాంపురం తండాలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2024 ఎన్నికలలో 11 సీట్లు మాత్రమే వచ్చాయని తన పద్ధతి మార్చుకోకపోతే ఈసారి ఎన్నికలలో సింగిల్ డిజిట్ సిటే వస్తుందని కూటమి అనటం హాస్యాస్పదమన్నారు. 2014 ఎన్నికలలో కూటమి పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పుడే వైఎస్సార్ సీపీ 67 అసెంబ్లీ కైవసం చేసుకుందని తెలిపారు. 2019 ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీలు విడివిడిగా పోటీ చేస్తే టీడీపీకి 23 సీట్లు, జనసేన ఒక సీటు, బీజేపీకి సున్నా సీట్లు వచ్చిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. 2019 ఎన్నికలలో జనసేన పార్టీ తరఫున రెండు చోట్ల పోటీ చేసి రెండు చోట్ల ఓటమి చెందిన విషయం పవన్ కళ్యాణ్‌కు, నాగబాబుకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే 2024 ఎన్నికలలో కూటమి పార్టీలు కూటమిగా ఏర్పడి ఎలక్షన్ కమిషన్‌ను తమ కనుసన్నలలో పెట్టుకొని అధికారంలోకి వచ్చిన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. జనసేన ఒంటరిగా పోటీ చేస్తే కనీసం ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం లేని పవన్ కల్యాణ్, జనసేన నేత కొణిదెల నాగబాబు, టీడీపీ నేతలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారని, ఆయనను నెల్లూరు కేంద్ర కారాగారంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడం నేరం అన్నట్లు విమర్శించటం దుర్మార్గమన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల శాసనసభ స్థానం నుంచి 2009, 2012, 2014, 2019 ఎన్నికలలో వరుసగా నాలుగుసార్లు పోటీ చేసి గెలుపొందారని, అటువంటి వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం అన్యాయమని జగన్ అనటం తప్పెలా అవుతుందని కూటమి నాయకులను నిలదీశారు. 2024 ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, చేతనైతే ప్రజలకు మంచి చేసి ప్రజల మనస్సును గెలుచుకోవాలని వైఎస్సార్‌సీపీ శ్రేణుల పై దాడులు చేయడం, ఇళ్లను ధ్వంసం చేయడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయటం, వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను కూల్చటం సరైన పద్ధతి కాదని జగన్ అనటం గలాటా ఎలా అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మాజీ సీఎం జగన్ పై దుష్ప్రచారం చేయడం మానుకొని రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని హనుమంత్ నాయక్ కోరారు.

అక్కడ దహనం చేసిందేమిటో..!

- ఆనవాళ్లు లేకుండా కాల్చినది ఎందుకో..!!
- చెంఘీజ్‌ఖాన్‌పేటలో అనుమానాస్పదంగా సంఘటన
- కాల్చిన బూడిదలో ఎముకలు లభ్యం



అనుమానాస్పదంగా కాల్చినట్లు గుర్తించిన ప్రదేశం ఇదే

యడ్లపాడు: కొండవీడు రిజర్వు ఫారెస్టు కొండల సమీపంలో ఓ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారన్న వార్త మండలంలో కలకలం రేపింది. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని సచివాలయం వెనుకవైపు అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని శుక్రవారం పోలీసులకు గొర్రెల కాపరులు సమాచారం ఇచ్చారు. దీంతో చిలకలూరిపేట రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్‌ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయం వెనుక అటవీ ప్రాంతంలోని పూలలొద్ది ఆంజనేయస్వామి గుడి కొండవీడు కొండల నడుమ అనుమానాస్పదంగా కాల్చిన ఆనవాళ్లు కనిపించాయి. సుమారు 4 అడుగుల వైశాల్యంలో కాల్చిన బూడిద, అందులో బొగ్గిలిపోయిన ఎముకలు, ఘటనా స్థలికి కొద్దిదూరంలో ఓ పుర్రె ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో జిల్లా అధికారులకు సమాచారం అందించి క్లూస్ టీంను పిలిపించారు. సంఘటనా స్థలంలోని పలు ఆధారాలను క్లూస్‌టీం అధికారులు సేకరించారు. వీఆర్వోల ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా పోలీసులు నమోదు చేశారు. సీఐ పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన గొర్రెల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు తాము శుక్రవారం సంఘటనా స్థలాన్ని చేరుకున్నామన్నారు. సంఘటనా స్థలంలో బాగా కాల్చడంతో కనీస ఆనవాళ్లను గుర్తించ లేకపోతున్నామన్నారు. దగ్ధమైన సంఘటన మాత్రం కనీసం మూడు రోజులు కిందట జరిగి ఉంటుందని భావిస్తున్నామని వివరించారు. అలాగే ఎముకలు చిన్నవిగా అందులోనూ నల్లగా మారిపోయి ఉండటంతో ఇవి మనిషివా లేక ఏదైన వన్య ప్రాణిదా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నామన్నారు. నిర్మానుష్య ప్రాంతంలో ఆ స్థాయిలో దగ్ధం చేయడానికి కారణాలు ఏమిటో తెలియాలంటే ముందుగా క్లూస్ టీం సేకరించిన ఫొరెన్సిక్ ల్యాబ్ నిపుణులు ఇచ్చిన ఆధారాలతో కేసు దర్యాప్తు ముందుకు పోతుందని తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి నిర్ధారణకు రాలేమన్నారు.



సంఘటనా స్థలంలో కనిపించిన పుర్రె

‘యూపీఎస్సీ’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈ నెల 7వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఈపీఎఫ్‌వో-పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్‌ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.సృజన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో కలెక్టర్ సృజన శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరిశీలకులు అశోక్ కుమార్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావుతో కలిసి లైజన్ కమ్ రూట్ ఆఫీసర్లు, పరీక్ష కేంద్రాల సూపర్ వైజర్లు, సహాయ సూపర్ వైజర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలోని తొమ్మిది కేంద్రాల్లో ఈపీఎఫ్‌వో, 16 కేంద్రాల్లో ఈఎస్‌ఐసీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్‌వో పరీక్షకు 2,401, ఈఎస్‌ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్‌వో-పర్సనల్ అసిస్టెంట్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈఎస్‌ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్ష జరగనున్నట్లు తెలిపారు. 25 మంది లైజన్ కమ్ రూట్ అధికారులు, 25 మంది సూపర్ వైజర్లు, 25 మంది సహాయ సూపర్ వైజర్లు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అవసరం మేరకు పటిష్ట బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో అదనపు బస్సులను నడపాలని ప్రజా రవాణా అధికారులకు సూచించారు.

‘కూచిపూడి’ డిప్లమో రాత పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో డిప్లమో రాత పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. డిప్లమో పేపర్-1 పరీక్షకు 34 మంది విద్యార్థులకు 30 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెంటెంట్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ తెలిపారు. పరీక్ష పరిశీలకులుగా డాక్టర్ విజయపాల్, పసుమర్తి హరినాథ శాస్త్రి, వేదాంతం వెంకట దుర్గా భవాని వ్యవహరించారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్ చిత్రంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ మహేష్

చేబ్రోలు: బైక్ చోరీలు చేస్తున్న ఆరుగురు అంతర్ జిల్లా దొంగల ముఠాను చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. చేబ్రోలు మండలం తోపాటు మంగళగిరి, తాడేపల్లి, నాదెండ్ల, చిలకలూరిపేట, పెదనందిపాడు, మాచవరం పోలీసు స్టేషన్ పరిధిలో వీరు మొత్తం 11 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్టు తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ వివరించారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రమేష్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చేబ్రోలు మండలం నారాకోడూరులో ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లను కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. వడ్లమూడి నిషిత్ ప్రసాద్, వెలగా దీపిక, వెలగా సాయినాథ్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. గుంటూరు రైలు పేట 1వ లైన్‌కు చెందిన రెడ్డి నాగభానుప్రకాష్, గుంటూరు రామిరెడ్డితోట 3వ లైన్‌కు చెందిన షేక్ ఇమ్రాన్ బాషా, గుంటూరు డొంక రోడ్డు 1వ లైన్‌కు చెందిన మునిపల్లి మధు రాజేష్, పల్నాడు జిల్లా రెంటచింతల ప్రాంతానికి చెందిన జక్కంపూడి గోపిరెడ్డి, గుంటూరు గణేష్ వీధి 3వ లైన్‌కు చెందిన పేరేచర్ల శాంతి కుమార్, గుంటూరు రామిరెడ్డితోట 4వ లైన్‌కు చెందిన షేక్ షఫీ ఈ చోరీలు చేసినట్టు గుర్తించి నారాకోడూరు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువ చేసే 11 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్ కుమార్‌తోపాటు సిబ్బంది యు.శ్రీనివాసరావు, జి.నాగరాజు, పి.శివనాగరాజు, అప్పలనాయుడు, ఎస్.ధర్మరాజు మరి కొందరిని తెనాలి డీఎస్పీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న వీవో యానిమేటర్స్

ఈపూరు: ఈపూరు గ్రామంలో వినుకొండ, శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల, ఈపూరు మండలాల్లోని వీవో యానిమేటర్స్‌కి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ వేయడం వలన భూమికి, పంటకు కలిగే ప్రయోజనాలను స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ వివరించారు. జిల్లా ఎన్‌ఎఫ్‌ఏ సైదయ్య బీజామృతం ద్రవ, జీవామృతం డెమోస్ తయారు చేసి చూపించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వలన మొలక శాతం ఎక్కువగా వస్తుందని, భూమి నుంచి విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లు నివారించవచ్చని సూచించారు. డీఎంఎంటీ ప్రకాష్ మాట్లాడుతూ భూమిలో ఘన జీవామృతం వేయడం భూమిలో కర్బన శాతం పెరుగుతుందన్నారు. అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని సూచించారు. ఎంటీ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెరటి తోటలు వేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు లభించడంతో పాటు వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి శివలక్ష్మి, వేణుగోపాల్, లక్ష్మానాయక్, సీసీలు సుబ్బారావు, భాస్కరరావు, యానిమేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన రాష్ట్ర స్థాయి జట్టుతో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె సుబ్రహ్మణ్యేశ్వరరావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం పల్నాడు జిల్లా జూనియర్ బాలికలు ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు.
మొత్తం 30 మంది క్రీడాకారిణిలు హాజరు కాగా వారిలో ప్రతిభ చూపిన 23 మంది మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో జి.దివ్య (ఇరుకుపాలెం), ఎస్.శ్రావ్య (మాదల), ఎస్.శ్రావణి (మాదల), బి.చంద్రిక (సత్తెనపల్లి), జి.నవ్య (ఇరుకుపాలెం), కె.రోహిణి (సత్తెనపల్లి), పి.విజయలక్ష్మి(సత్తెనపల్లి), పి.అలేఖ్య (సత్తెనపల్లి), ఎస్.మౌనిక (సత్తెనపల్లి), ఎస్.మంజుల(సత్తెనపల్లి), పి.గాయత్రి(సత్తెనపల్లి), సిహెచ్ యోగి లావణ్య (మాదల), కె.త్రివేణి (మాదల), పి.ఈశ్వరి (సత్తెనపల్లి), వై.తేజస్విని (సత్తెనపల్లి), ఎస్‌కె షీమషరీన్(క్రోసూరు), పి.శ్వేత (భీమవరం), ఆర్.ప్రసన్న (సత్తెనపల్లి), ఏ.యశస్వి (ముప్పాళ్ల), ఎస్.హేమలత (బట్లూరు), ఎం.అనుగీతిక (సత్తెనపల్లి), జి.స్మైలీ(సత్తెనపల్లి), ఎస్.సంయుక్త(ధూళిపాళ్ల)లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారిణిలు ఈనెల 7 నుంచి అనంతపూర్ ఆర్డిటి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. జట్టు ఎంపికలో పీడీలు ఎస్‌కె.రియాజ్, ఐఎస్.నాగిరెడ్డి, ఎ.శ్రీరామ్‌రెడ్డి, ఎస్‌ఎం సుభాని, సత్యవతి, అచ్చిరెడ్డి, నరసింహారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

- ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు
- మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.25వేలు అందజేత



మృతుడు షేక్ బాబామస్తాన్ (ఫైల్)

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొని బస్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. చిలకలూరిపేట ఆర్టీసీ డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం మండలం వేమూలూరిపాడు గ్రామానికి చెందిన షేక్ బాబామస్తాన్ (54) నరసరావుపేట డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నరసరావుపేట నుంచి చీరాలకు ప్రయాణికులతో బయలుదేరాడు. చిలకలూరిపేట పట్టణంలోని బస్టాండ్ సమీపంలోకి రాగానే కంటైనర్ వాహనం ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్యాబిన్‌నుంచి బయటకు వచ్చి పడిన డ్రైవర్‌ను కంటైనర్ వాహనం సుమారు 30 మీటర్ల మేర హైవేపై ఈడ్చుకు వెళ్లింది. దీంతో అక్కడికక్కడే డ్రైవర్ మృతి చెందగా, బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఆర్టీసీ బస్ కండక్టర్ తోట శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ ఆదాంసాహెబ్, నరసరావుపేట డీపీటీవో శ్రీనివాసరావు, డిపో మేనేజర్ బి వీరాస్వామి, గుంటూరు సీఎంఈ ఎన్ శ్రీనివాసరావు మృతి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి తక్షణ సాయంగా రూ.25వేలను అందజేశారు.

విజయదుర్గా ఆలయంలో చండీ హోమం



చండీ హోమంలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం చండీ హోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం, అమావాస్య నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి విశేష అలంకరణ , పూజలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. అనంతరం యాగశాలలో చండీహోమం , మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో హోమం జరిపించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

పసుపు రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రాష్ట్ర పసుపు రైతుల కమిటీ సమావేశాన్ని శుక్రవారం వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ 2023లో ప్రధాని నరేంద్రమోదీ వాగ్దానం చేసిన మేరకు తెలంగాణాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు పండించే అన్ని జిల్లాల్లో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, జనవరి 19, 2024న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపు పంట భద్రపరుచుకుని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే క్వింటాకు రూ.12,500 చెల్లించాలని కోరారు. పసుపు పంటకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కేశవరావు, కో కన్వీనర్ కొండా రామిరెడ్డి, కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, ఆంజనేయులు, ఎం. శ్రీనివాసరెడ్డి, వై. బ్రహ్మేశ్వరరావు, కృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ‘హంస’ తెనాలి కొత్త కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో జిల్లా నాయకులు

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోషియేషన్ (ఏపీ హంస) సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు నాగవర్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.వెంకటరెడ్డి, కార్యదర్శిగా ఆర్‌ఎల్ నరసింహారావు, కోశాధికారిగా శారద, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.విశ్వనాథ్, పబ్లిసిటీ సెక్రటరీగా మల్లికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగవర్ధన్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ గుర్తింపు పొందిన మొదటి యూనియన్ తమదేనని తెలిపారు.